# అధికారులు అందుబాటులో ఉండాలి

- బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి
- పోలింగ్ కేంద్రాల పరిశీలన



బాన్సువాడలోని పోలింగ్ కేంద్రంలో దరఖాస్తులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ/ నస్రుల్లాబాద్, నవంబర్ 24: బాన్సువాడలోని కోనా బాన్సువాడ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, బీర్కూర్ మండలంలోని బీర్కూర్, కిష్టాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులతో మాట్లాడారు. అభ్యంతరాలు, ఓటరు నమోదు కోసం వచ్చే వారికి సహాయం అందించేందుకు తహసీల్దార్లు, బూత్ లెవెల్ అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా చూడాలన్నారు.

***పోలింగ్ సెంటర్లను పరిశీలించిన తహసీల్దార్***

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 24: ప్రత్యేక ఓటరు దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ అల్లం మహేందర్ ఆదివారం తనిఖీ చేశారు. పట్టణంలోని ఐదు పోలింగ్ కేంద్రాలతోపాటు గండిమాసానిపేట్‌లోని రెండు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కేంద్రాల్లో సిబ్బంది పనితీరు, వచ్చిన దరఖాస్తు ఫారాల వివరాలు తెలుసుకున్నారు. ఆయనతోపాటు గిర్దావర్ శ్రీనివాస్ ఉన్నారు.



ఎల్లారెడ్డిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ మహేందర్

# రైతుల ఖాతాల్లోకి ధాన్యం డబ్బులు

నాగిరెడ్డిపేట, నవంబర్ 24: మాల్తుమ్మెద సింగిల్ విండో ఆధ్వర్యంలో 1028 మంది రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించి వారి ఖాతాల్లో రూ.13కోట్ల55 లక్షల నగదు జమ అయినట్లు విండో కార్యదర్శి సందీప్ ఆదివారం తెలిపారు. ఇప్పటి వరకు 1,976 మంది రైతుల నుంచి కోటీ96 వేల బస్తాల (లక్షా 18వేల క్వింటాళ్ల) ధాన్యం కొనుగోలు చేసినట్లు చెప్పారు. మిగతా రైతుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారని, వివరాల నమోదు అనంతరం మూడు రోజుల్లో డబ్బులు జమ అవుతాయని తెలిపారు.

# డ్రైనేజీల కూల్చివేత : ఇంటి ఎదుటే మురికి నీరు

- ఇబ్బంది పడుతున్న పోచారం గ్రామస్తులు
- హైవే పనులు చేపట్టడంతో మురికి కాలువ తిప్పలు
- డ్రైనేజీ నిర్మించాలని వినతి



పోచారం గ్రామంలో డ్రైనేజీ కూల్చడంతో ఇండ్ల ఎదుట నిలిచిన మురికినీరు

నాగిరెడ్డిపేట, నవంబర్ 24: మండలంలోని పోచారం గ్రామం మీదుగా హైవే విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దీంతో నెల రోజుల క్రితం రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురికికాలువలను కాంట్రాక్టర్లు కూల్చివేశారు. డ్రైనేజీ లేకపోవడంతో ఇండ్లలోని మురికి నీరు బయటికి వెళ్లడం లేదు. ఇంట్లో నుంచి వచ్చిన నీరు ఇంటి ముందరే నిలిచి మురికికూపంగా మారుతున్నదని ప్రజలు వాపోతున్నారు. ఈ విషయమై పంచాయతీ సిబ్బంది పట్టించుకోవడం లేదని, రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. హైవే అధికారులను ప్రశ్నిస్తే.. యాభై ఫీట్ల బయట డ్రైనేజీని నిర్మించుకోవాలని, డ్రైనేజీ నిర్మాణం తమ పనికాదని అంటున్నారని తెలిపారు. మురికి కాలువలు పంచాయతీ నిధులతో నిర్మించుకోవాలని సూచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎవరో ఒకరు స్పందించి డ్రైనేజీని నిర్మించి తమ ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

**డ్రైనేజీ నిర్మించక ఇబ్బంది..**



హైవే విస్తరణ పనులు చేపడుతున్న అధికారులు ఇటీవల నిర్మించిన నూతన డ్రైనేజీలను కూల్చివేశారు. నూతన రోడ్డు పనులు కొనసాగుతుండడంతో మురికినీరు ఇంటి ఎదుట నిలుస్తున్నది. మురికి కూపంగా మారి దుర్గంధం వ్యాపిస్తున్నది. డ్రైనేజీ నిర్మాణాన్ని హైవే అధికారులు, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.

**- కలాలి అశోక్‌గౌడ్, పోచారం**

# పెండింగ్ చలాన్లను చెల్లించాలి

- ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
- వాహనదారులకు పోలీసుల సూచన
- లింగంపేట, బీబీపేటలో వాహనాల తనిఖీ



లింగంపేటలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

లింగంపేట / బీబీపేట, నవంబర్ 24: లింగంపేటలోని పోలీస్‌స్టేషన్ ఎదుట పోలీసులు ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలపై ఉన్న పెండింగ్ చలాన్లను పరిశీలించారు. పెండింగ్ చలాన్లను వెంటనే చెల్లించాలని వాహనదారులకు సూచించారు. చలాన్లు చెల్లించకుంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రయాణం చేస్తున్న సమయంలో ప్రమాదానికి గురైతే హెల్మెట్ ఉంటే ప్రాణాపాయం నుంచి బయటపడే అవకాశం ఉంటుందని తెలిపారు. హెల్మెట్ లేనివారికి జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎస్సై ప్రకాశ్, హెడ్ కానిస్టేబుల్ పెంటయ్య, సిబ్బంది రాజు, బన్సీ, హమేద్ తదితరులు పాల్గొన్నారు. బీబీపేట్‌లోని శ్రీగాధ రోడ్డులో ఎస్సై ప్రభాకర్ ఆదేశాల మేరకు పోలీస్ సిబ్బంది ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన ధ్రువ పత్రాలు లేని 40 మంది వాహనదారులకు జరిమానా విధించారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పకుండా పాటించాలని పోలీసులు సూచించారు కార్యక్రమంలో సిబ్బంది రవీందర్, సాయిలు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## చుక్కాపూర్ లో భక్తుల సందడి

మాచారెడ్డి, నవంబర్ 24: మండలంలోని చుక్కాపూర్ అటవీ ప్రాంతంలో కొలువైన శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ప్రత్యేక పూజలు చేశారు. జిల్లా నలుమూలలతోపాటు ఇతర జిల్లాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. స్వామి వారికి ఒడి బియ్యం, పట్టె నామాలు, కోరె మీసాలు, కండ్లు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. నూతన వాహనాలకు ప్రత్యేక పూజలు చేయించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

## సర్వే వివరాలు పొరపాట్లు లేకుండా నమోదు చేయాలి

లింగంపేట, నవంబర్ 24: సమగ్ర కుటుంబ సర్వే వివరాలను పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో నరేశ్ డాటా ఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు. జీవదాన్ పాఠశాలలో చేపడుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎన్యుమరేటర్లు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించినట్లు తెలిపారు. సర్వేలో సేకరించిన వివరాలు తప్పు నమోదు చేస్తే ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. ఆయనవెంట ఎంపీవో మల్హరీతో పాటు ఆయా పంచాయతీల కార్యదర్శులు ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న నాయకులు

రాజంపేట్, నవంబర్ 24: మండలంలోని ఎల్లారెడ్డి నియోజకవర్గం పరిధిలో ఉన్న ఆర్గొండ, అన్నారం, అన్నారం తండా, శేర్‌శంకర్ తండాలకు చెందిన పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు మంజూరయ్యాయి. వాటిని లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి స్థానిక నాయకులు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కాంగ్రెస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర ప్రణీత్ రెడ్డి, యూత్ మండల ఉపాధ్యక్షుడు సుభాష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ఎన్ఎంఎంఎస్ పరీక్ష

కామారెడ్డి, నవంబర్ 24: నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఆదివారం ప్రశాంతంగా నిర్వహించామని జిల్లా విద్యాశాఖ అధికారి రాజు తెలిపారు. కామారెడ్డి జిల్లావ్యాప్తంగా కామారెడ్డి డివిజన్‌లో నాలుగు, బాన్సువాడ డివిజన్‌లో రెండు కేంద్రాల్లో పరీక్ష నిర్వహించినట్లు పేర్కొన్నారు. 1,202 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా.. 1,161 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. 41 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని తెలిపారు.

# నిరుపేదలకు రగ్గులు పంపిణీ

**మానవత్వం చాటుకున్న చిన్నారులు**



పేదలకు రగ్గులను పంపిణీ చేస్తున్న విద్యార్థులు

బాన్సువాడ, నవంబర్ 24: పట్టణానికి చెందిన పలువురు చిన్నారులు మానవత్వాన్ని చాటారు. పట్టణంలో చలికి వణుకుతున్న నిరుపేదలను చూసి స్థానిక న్యూటన్ స్కూల్ విద్యార్థులు చలించిపోయారు. పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న వారంతా కలిసి రూ.ఐదువేల వరకు డబ్బులను జమచేశారు. వాటితో రగ్గులను కొని నిరుపేదలకు ఆదివారం అందజేశారు. దీంతో వారిని పట్టణ ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మహేందర్, విద్యార్థులు సయ్యద్ నిహాల్ హుస్సేన్, చైతన్య, సాయిచరణ్, సామ్యూల్, సన్నిత్ రెడ్డి, సాక్షిత్, దాసరి కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

## సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ ఇప్పించేలా చూడాలి



హర్షవర్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న మోడల్ స్కూల్ టీచర్లు

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 24: సీపీఎస్ మ్యాచింగ్ గ్రాంట్ ఇప్పించాలని, కారుణ్య నియామకాలు చేపట్టేలా చూడాలని కోరుతూ మోడల్‌స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ పీఆర్టీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మోడల్‌స్కూల్ ఉపాధ్యాయులకు 010 ద్వారా వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఔట్‌సోర్సింగ్ ఎస్జీటీ, ఒకేషనల్ టీచర్ల వేతనాలు ఇప్పించాలని కోరారు. దీనికి స్పందించిన ఆయన .. త్వరలో 010 ద్వారా వేతనాలు అందుతాయన్నారు. సమస్యలన్నింటిని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అనంతరం ఉపాధ్యాయుల బదిలీలకు కృషి చేసినందుకు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో టీఎంఎస్టీఏ ప్రతినిధులు రాజశేఖర్, సాయిబాబా, నర్సింహాచారి, విద్యారమణ తదితరులు పాల్గొన్నారు.

## నేడు త్రిలింగేశ్వరాలయంలో కార్తీక మాస ప్రత్యేక అభిషేకాలు

నాగిరెడ్డిపేట, నవంబర్ 24: మండలంలోని తాండూర్ శివారులోని పురాతన మహిమాన్విత త్రిలింగేశ్వరాలయంలో కార్తీక సోమవారాన్ని పురస్కరించుకొని ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మ దత్తు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తాగునీరు, వసతి సౌకర్యాలు కల్పించినట్లు పేర్కొన్నారు.



# యాసంగి సాగుకు రైతులు సన్నద్ధం

బాన్సువాడ రూరల్, నవంబర్ 24: వానకాలంలో సాగుచేసిన పంటలు చేతికొచ్చి ధాన్యం అమ్ముకున్న రైతులు, యాసంగి పంటల సాగులో నిమగ్నం అవుతున్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు నిండుకుండలా ఉండడంతో యాసంగి పంటలకు ఢోకా లేదనే ధీమాలో రైతులు ముందుస్తు సాగుకు సిద్ధం అయ్యారు. బాన్సువాడ మండలంలో నిజాంసాగర్ ఆయకట్టు పరిధిలోని బోర్లం, మొగులాన్‌పల్లి, తిర్మాలాపూర్, ఇబ్రహీంపేట్, పోచారం, రాంపూర్, జక్కల్‌దాని తండా, కొయ్యగుట్ట గ్రామాల రైతులు వరిసాగుకు మొగ్గు చూపుతున్నారు. నారుమడులను సిద్ధం చేసి విత్తనాలు అలుకుతున్నారు. నెల రోజుల్లో నారు చేతికి వస్తుందని, డిసెంబర్ ఆఖరు నాటికి నాట్లు పూర్తి చేస్తామని రైతులు తెలిపారు.

బోర్లం గ్రామ శివారులో నారుమడుల్లో విత్తనాలు చల్లుతున్న రైతులు

# 'నిహారిక' పాటల సీడీ విడుదల



సీడీని ఆవిష్కరిస్తున్న గజల్ కవి సూరారం శంకర్

కామారెడ్డి, నవంబర్ 24: ప్రముఖ కవి, రచయిత గఫూర్ శిక్షక్ రాసి, పాడి రూపొందించిన నిహారిక వీడియో పాటల సీడీని కామారెడ్డిలోని సీనియర్ సిటిజన్స్ ఫోరం కార్యాలయంలో ప్రముఖ గజల్ కవి సూరారం శంకర్ ఆదివారం విడుదల చేశారు. ఈ పాట వీడియోలో శివ, ఝాన్సీ నటించగా.. కొడి రవీందర్ దర్శకత్వం వహించారు. చిన్ని కృష్ణ సంగీతాన్ని, బన్నీ వర్మ కెమెరా సహకారం అందించారు. ఈ సందర్భంగా గఫూర్ శిక్షక్ మాట్లాడుతూ.. నిహారిక పాటలు యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేసినట్లు చెప్పారు. మంచి సాహిత్యంతో కూడుకున్న పాటలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంటాయన్నారు. కార్యక్రమంలో కవులు అల్లి మోహన్‌రాజ్, తిరుపతిరావు, ప్రభాకర్, సంగాగౌడ్, బాలకృష్ణ, దర్శకుడు కొడి రవీందర్, నటీనటులు శివ, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

# కట్టు కాలువ నిర్మాణ పనులు ప్రారంభం



కట్టు కాలువపై నిర్మిస్తున్న కల్వర్టు

లింగంపేట, నవంబర్ 24: మండల కేంద్రంలోని కట్టు కాలువ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. మత్తడి కాలువ నుంచి చీరపేండ్ల కుంట, సూర్న కుంటల్లోకి సాగు నీటి కోసం నిర్మించిన కాలువ పూర్తిగా మట్టితో నిండిపోవడంతోపాటు కల్వర్టులు శిథిల దశకు చేరుకున్నాయి. దీంతో నీరు రావడం లేదు. సాగు నీటిని సరఫరా చేసే కాలువ కాస్త మురికి కాలువగా మారింది. కాలువ మొత్తం చెత్తతో నిండిపోవడంతో గత వానకాలంలో మురికి నీటితో నిండి దుర్గంధం వెదజల్లుతోంది. వర్షం నీరు తరలించడానికి తాత్కాలికంగా పనులు చేపట్టారు. కాలువ మనమ్మతుల కోసం నీటి పారుదల శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపించగా.. సుమారు 50 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆ నిధులతో అధికారులు పనులు ప్రారంభించారు. ముందుగా కల్వర్టుల నిర్మాణం చేపడుతున్నారు. కల్వర్టుల నిర్మాణం అనంతరం కాలువలో పూడిక పనులు చేపట్టనున్నట్లు నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారు.

# సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా సలహాదారు లింగమయ్య

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 24: సమాచార హక్కు చట్టం -2005పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా సలహాదారు లింగమయ్య అన్నారు. ఎల్లారెడ్డి పట్టణంలోని వెనుకబడిన తరగతుల బాలికల వసతిగృహంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆర్టీఏ రాష్ట్ర డైరెక్టర్ సలీం ఆదేశాల మేరకు సమాచార హక్కు చట్టం -2005పై అవగాహన సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. సమాచార హక్కు చట్టం వజ్రాయుధం, బ్రహ్మాస్త్రం లాంటిదని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాలల్లో సమాచార హక్కు చట్టం బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో వసతిగృహం వార్డెన్ విజయశాంతి, బాలికలు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**PLOT FOR SALE**

★ డిచ్‌పల్లి టు ఆర్మూర్ వెళ్లే మెయిన్ రోడ్ నుండి 50 మీటర్ల దూరంలో మార్కెట్ దగ్గర 24x76 = 202 Sq.yads. మరియు 34x27 = 102 Sq.yds. ప్లాట్లు అమ్మకానికి కలవు. Ph: 9396411685, 9493984827.

NT-326605

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే.
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# అంగన్‌వాడీ కేంద్రాలకు కుర్చీల వితరణ



కుర్చీలను అందజేస్తున్న రాజమౌళి గుప్తా

మాచారెడ్డి, నవంబర్ 24: మాచారెడ్డి సెక్టార్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలకు వ్యాపారవేత్త, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు శెనిశెట్టి రాజమౌళి గుప్తా 400 కుర్చీలను ఆదివారం అందజేశారు. గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే విద్యార్థుల సౌకర్యార్థం కుర్చీలను అందజేసినట్లు చెప్పారు. దోమకొండ సీడీపీవో రోచిశ్మ సమక్షంలో కుర్చీలను బహూకరించగా.. ఆయనకు శాలువా కప్పి సత్కరించారు. మాచారెడ్డి ఎస్సై అనిల్, కాం గ్రెస్ మండలాధ్యక్షుడు నౌసిలాల్, భూక్యా బన్సీలాల్, నర్సాగౌడ్, సీతారాం, బుచ్చిరెడ్డి, రవీందర్, తిరుపతి, శర్మన్, శంకర్, రవినాయక్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

## మాల సంఘం నియోజకవర్గ కార్యవర్గం ఎన్నిక

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 24: మాల సంఘం ఎల్లారెడ్డి నియోజకవర్గ నూతన కమిటీని ఆదివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకుడు అయ్యల సంతోష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాలల హక్కుల కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడడమే సంఘ ప్రధాన లక్ష్యమని చెప్పారు. సంఘం ఎల్లారెడ్డి నియోజవర్గ అధ్యక్షుడిగా మోహన్, ఉపాధ్యక్షుడిగా గైని సాయిలు, కోశాధికారిగా సాయిబాబా, సంయుక్త కార్యదర్శులుగా రాజు, బ్యాగరి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ప్రభాకర్, సతీశ్, వినయ్ కుమార్, సంతోష్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రం అందుకుంటున్న నూతన కార్యవర్గ సభ్యులు

# క్రీడాకారులకు వాలీబాల్స్ అందజేత



వాలీబాల్స్ అందజేస్తున్న రిటైర్డ్ టీచర్ సంతోష్‌రెడ్డి

గాంధారి, నవంబర్ 24: మండలంలోని పేట్ సంగెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో బామన్ క్రీడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులకు ఆదివారం రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయుడు సంతోష్ రెడ్డి ఆరు వాలీబాల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్‌రాథోడ్, బామన్ ఫౌండేషన్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.